క్లుప్తంగా

ఉన్నత విద్య అభ్యసించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: కిషోర్ బాలికలకు ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు వీలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సీడీపీవో విజయకుమారి తెలిపారు. ఆమె సోమవారం అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తిస్తామన్నారు. అలాంటి వారిని గ్రూపుగా తయారు చేస్తామని, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి ఉన్నత చదువులు చదివేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. పూర్తి ఆత్మ విశ్వాసాన్ని నింపుతామన్నారు.దీనిపై వర్కర్లకు తగు సూచనలు చేశారు. 18 సంవత్సరాలలోపు బాలికలు చదువు మానేసి గ్రామాల్లో ఉంటే వారి పేర్లు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. దీనిలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

44 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెంలో సోమవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. జడ్డంగి పీహెచ్‌సీ వైద్యాధికారి యామిని ప్రియ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో సుమారు 44 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. హెచ్‌వి చిన్నయ్యమ్మ, ఏఎన్‌ఎం శేషారత్నం, 104 డీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సిబ్బందికి సూచనలు



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి నీలవేణి

డుంబ్రిగుడ: వివిధ శాఖల వారీగా కొనసాగుతున్న కార్యక్రమాల్లో భాగంగా క్షేత్రస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించినట్టు వ్యవసాయ శాఖాధికారి నీలవేణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం ఆర్‌బీకేలో నిర్వహించిన సమావేశంలో మట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు, సోషల్ ఆడిట్ జాబితాలు, రాతికట్టు నిర్మాణాలు, మట్టి నమూనా సేకరణ, జెఎస్‌జీ గ్రూపులకు రుణాలు, పంట కోత ప్రయోగాలు, వివిధ క్షేత్ర పంటలపై ఎఫ్‌పీజీ సమూహాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ జేఈగా జయరాజు

చింతపల్లి: చింతపల్లి ఆర్‌అండ్‌బీ జేఈగా జయరాజు బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లిలో ఇప్పటి వరకూ జేఈగా పనిచేసిన భరత్‌కు సీలేరు సెక్షన్‌కు బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో పార్వతీపురం డివిజన్‌లో పనిచేస్తున్న జయరాజును సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ చేశారు.

సందడిగా దుర్గాదేవి అనుపోత్సవం



చింతపల్లిలో దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు

చింతపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు చింతపల్లిలో సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని చింతపల్లి రంగాసెంటర్‌లో అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు ఘనంగా పూజలు చేశారు. అమ్మవారి అనుపోత్సవం సందర్భంగా సోమవారం నిర్వాహకులు భారీ అన్నసమారాధన చేశారు. అనుపోత్సవంలో భాగంగా తప్పెటగుళ్లు, కోలాటాలు, బళ్ల వేషాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.చింతపల్లిలో సందడి నెలకొంది.

రంపచోడవరం: రంపచోడవరంలో మోటార్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకలు ముగింపులో భాగంగా సోమవారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో భక్తులతో ఊరేగింపు జరిగింది. ఈ నెల 17న అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పనులు పూర్తయ్యేదెన్నడో?



పునాదులకే పరిమితమైన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం



పెదలబుడులో అసంపూర్తిగా దర్శనమిస్తున్న సచివాలయం భవనం

- అర్ధంతరంగా నిలిచిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల పనులు
- కూటమి ప్రభుత్వంలో అందని సేవలు
- బిల్లులందక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్‌లు

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు ఎన్నికల కారణంగా అర్ధంతరంగా నిలిచిపోయాయి. జగనన్న పాలనలో నిర్మాణం చేపట్టిన గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేలు గిరిజన ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేసే వారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతీ సచివాలయానికి సిబ్బందిని నియమించి, సచివాలయ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ. 40 లక్షలు, ఆర్‌బికేలకు రూ.23 లక్షలు, వెల్‌నెస్ సెంటర్లకు రూ. 20.50 లక్షల చొప్పున కేటాయించారు. అరకులోయ మండలంలో 18 సచివాలయాలు, ఆర్‌బికేలు 18, వెల్‌నెస్ సెంటర్లు 8 భవనాల నిర్మాణానికి జగనన్న ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. డుంబ్రిగుడ మండలంలో 16 సచివాలయాలు, 16 ఆర్‌బికేలు, 13 వెల్ సెంటర్లు మంజూరు చేసింది. ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలు గడిచినా ఆయా నిర్మాణాలకు పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు.



ఎండపల్లివలసలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఆర్‌బీకే భవనం

రెండు మండలాల్లో 34 సచివాలయ భవనాలకు కేవలం 8 భవనాలు మాత్రమే పూర్తి చేసారు. 34 ఆర్‌బికేలకు 9 భవనాలే పూర్తయ్యాయి. 21 హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల మంజేరైతే నేటికి ఒక్కటి పూర్తి చేయలేదు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనులకు మెరుగైన సేవలందించాలన్న సంకల్పాన్ని ప్రస్తుత ప్రభుత్వం నీరుగారుస్తోంది. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం ఆర్‌బీకె. సచివాలయ, వెల్‌నెస్ సెంటర్లు పూర్తి చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

పనులు పూర్తి చేయాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజల చెంతకే సేవలందించాలన్న సంకల్పాన్ని ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చాలి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, సచివాలయం, ఆర్‌బికే, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి, ప్రస్తుత ప్రభుత్వం వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– పి.బి. ఆనందరావు, గిరిజనుడు, పెదలబుడు గ్రామం, అరకులోయ

పనులు పూర్తయ్యేలా చర్యలు

సచివాలయం, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే నిర్మాణాలు చేసిన వాటికి గత ఏడాది అక్టోబర్‌లో బిల్లులు చెల్లించారు. ఈ ఏడాది కొన్నింటికి మే నెలలో బిల్లులు చెల్లించినప్పటికి గుత్తేదారులు నిర్మాణాలు చేపట్టలేదు. ఆయా పనులు పూర్తి చేయాలని వారిపై ఒత్తిడి తెస్తున్నాం.

– పి. రామ్ అజేయ్ కుమార్, పీఆర్ ఏఈఈ, డుంబ్రిగుడ మండలం

విద్యార్థి మృతికి పాడేరు ఎమ్మెల్యే సంతాపం



బూసుపల్లిలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని గురుకులం పాఠశాలలో చదువుతూ దసరా సెలవులకు ఇంటికి వెళ్లి అనారోగ్యానికి గురై మృతి చెందిన విద్యార్థికి పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సంతాపాన్ని తెలియజేశారు. మండలంలో జి.మాడుగుల పంచాయతీ బూసుపల్లి గ్రామానికి చెందిన కడవం లోకేష్‌బాబు స్థానిక గురుకులం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికెళ్లిన ఆ విద్యార్థి పచ్చకామెర్లు ఇతర అనారోగ్య సమస్యలతో సోమవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మండలంలో బూసుపల్లి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొడుకును కోల్పోయిన పుట్టెడు దుఃఖంలో ఉన్న మృతుడు తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్ కిముడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు తదితరులు విద్యార్థి లోకేష్‌బాబు మృతికి సంతాపాన్ని తెలిపారు.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

హుకుంపేట: ప్రభుత్వ కళాశాలల్లో నిధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్‌లకు ప్రభుత్వం రెగ్యూలరైజ్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల 475 కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.రమేష్‌నాయుడు తెలిపారు. రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ కమిటీ పిలుపు మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు పసుపు బ్యాడ్జీలతో కళాశాలకు హాజరై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ లెక్చరర్‌ల సమస్యలు తెలుసుకుని రెగ్యులర్ చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తమకు న్యాయం చేయాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల 19వ తేదీ వరకు పసుపు బ్యాడ్జీలతో విధులకు హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు. జిల్లా కార్యదర్శి మత్యరాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న అధ్యాపకులు

ఘాట్ రోడ్డులో గోతులు పూడ్చాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: పాడేరు ఘాట్‌రోడ్డులో సెల్ టవర్ల నిర్మాణం కోసం తీసిన గౌతులను పూడ్చాలని విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. పాడేరులో సెల్‌టవర్ల నిమిత్తం కేబుల్ కోసం ఘాట్ రోడ్డులో తీసిన గోతుల వల్ల వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న అవస్థలపై ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడేరు ఘాట్ మార్గంలో సెల్‌టవర్ల కేబుల్ కోసం గోతులు తీసి రెండు వారాలు కావస్తున్నా వాటిని పూడ్చకపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదని, పలుమార్లు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అత్యవసర సమయాల్లో రోగుల వాహనాలు ఆలస్యం అవ్వడంతో సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి నెలకొందనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో గోతుల వల్ల ఎదురెదురుగా ఒకేసారి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. గోతులను తప్పించే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారంపై కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక చొరవ తీసుకోని గోతులను పూడ్చే ఏర్పాట్లు చేయాలని ఆమె కోరారు. ఘాట్‌రోడ్డు మార్గంలో గోతుల వల్ల అవస్థలను వాహనాదారులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, వారి ఇబ్బందులు తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెల్ టవర్ల కాంట్రాక్టర్లుతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



రామాపురంలో మొక్కను నాటుతున్న ఎంపీడీవో మేరీరోజ్, సర్పంచ్ వెంకటలక్ష్మి



అరకులో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శారద, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్



గంగవరంలో పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ

కొయ్యూరు: మండలంలోని మూలపేట పంచాయతీ రామాపురంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజ్, సర్పంచ్ వెంకటలక్ష్మి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు మానవ జీవితానికి రక్షణ కల్పిస్తాయన్నారు. మొక్కల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పనుల్లో భాగంగా కందకాల తవ్వకాలను సర్పంచ్ వెంకటలక్ష్మి ప్రారంభించారు.

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీలో సోమవారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ జి.శారద, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ పలు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీవో సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



యార్లగడ్డలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు తదితరులు

గంగవరం: గంగవరంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సోమవారం సర్పంచ్ కలుముల అక్కమ్మ, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి తదితరులు సీసీ రోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీ ప్రత్యేకాధికారి సిద్దేశ్వరరావు, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ప్రభ, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుల్లియమ్మ, చిన్నారావు, జనసేన మండల అధ్యక్షుడు సిద్దూ, సచివాలయ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని చామగడ్డ, యార్లగడ్డ పంచాయతీ కేంద్రాల్లో ఈఓపీఆర్‌డీ డి శివకుమార్, ఏపీఓ సాయిబాబల అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బులక్ష్మి, సర్పంచ్‌లు జర్త కృష్ణారెడ్డి, పల్లాల పద్మావతి ముఖ్య అతిథులుగా పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసారు. ఈసందర్భంగా యార్లగడ్డలో రూ. 5 లక్షల, 80 వేలుతో నిర్మించబోయే ఫారంపాండుకు, చామగడ్డలో రూ. లక్షా 50 వేలుతో నిర్మించే ఫారంపాండుకు శంకుస్థాపన చేసారు. పంచాయతీ కార్యదర్శులు మధుసూధనరాజు, పుడిగి భార్గవఫరణ్, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పల్లె పండగ

పెదబయలు: మండలంలోని మంగళవారం నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండగ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.విగ్గిన్స్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న లక్ష్మీపేట అడుగులపుట్టు, సీతగుంట, అరడకోట, సీకరి, 16న గలగండ, గంపరాయి, వనభంగి, 17న బొండాపల్లి, పోయిపల్లి, గోమంగి, గుల్లేలు, లింగేటి, బొంగరం, 18న పర్రెడ, రూడకోట, జామిగుడ, 19న గిన్నెలకోట, ఇంజరి, కొరవంగి, 20న కిముడుపల్లి, కుంతర్ల, పెదకోడాపల్లి పంచాయతీల్లో ఉపాధి హామీ, ఇతర శాఖలకు చెందిన పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులతో శంకుస్థాపన పనులు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్ట్ 22న ప్రతీ పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు గుర్తించామని, దశల వారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



ముంచంగిపుట్టులో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు



పెదవలసలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ జి–198 బెటాలియన్ ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, శిశు జనన నిరీక్షణ కేంద్రం, నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రహదారులపై చెత్తను, కాలువల్లో పూడికను తొలగించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతతోనే రోగాలు దూరమవుతాయన్నారు. సీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్, సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం గూడెంకొత్తవీధి మండలం పెదవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో పెదవలస ఏఓపీలో పనిచేస్తున్న సీఆర్‌పీఎఫ్ ఎ–234 బెటాలియన్ పోలీసులు పరిసరాలను శుభ్రం చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏకే నాయక్, పెదవలస వైద్యాధికారి పృధ్వీషా తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ అభివృద్ధిని మరచిన ప్రభుత్వం

- గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించండి

డుంబ్రిగుడ: పాడేరు ఐటీడీఏ నిధులతో పర్యాటకుల కోసం పారామోటార్, ఎయిర్ బెలూన్ లాంటివి ఏర్పాటు చేయడం అవసరమా అని మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు చటారి సాయిబాబా చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జైపూర్ జంక్షన్, పద్మాపురం ఉద్యానవనంలో వీటిని పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్నారన్నారు. గిరిజన గ్రామాల్లో ఇప్పటికే అనేక మారుమూల గ్రామాలు తాగునీరు, రోడ్డులు, డ్రైనేజీలు వంటి ముఖ్య మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం కనీసం దృష్టి సారించడం లేదన్నారు. ఐటీడీఏ నిధులను పర్యాటకుల సౌకర్యం కోసం ఖర్చు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రా గుహలను ఆధునికీకరించాలని ఆయన కోరారు. ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ టి.సోమేశ్వరరావు, నాయకులు చిన్నస్వామి, వెంకటబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సాయిబాబా, నాయకులు

ముగిసిన క్రికెట్ టోర్నమెంటు

వై.రామవరం: దసరా పండుగను పురస్కరించుకుని గ్రామ యువత ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ సహాయ సహకారాలతో గత గురువారం వై.రామవరంలో ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంటు సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఐ బి.రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ రాహుల్, ఎస్‌ఐ రామకృష్ణల చేతులమీదుగా విజేతలకు షీల్డు, నగదు బహుమతి అందజేశారు. టోర్నీలో వై.రామవరం టీమ్ విన్నర్‌గా నిలిచింది. కె.యర్రగొండ గ్రామ టీమ్ రన్నర్స్‌గా నిలిచినట్టు టోర్నీ కమిటీ అధ్యక్షులు గొర్లె నరేష్ తెలిపారు. ఈ టోర్నీలో వివిధ గ్రామాలకు చెందిన 18 టీమ్‌లు పాల్గొన్నట్టు చెప్పారు. గ్రామపెద్దలు మాణిక్యం, శ్రీకాంత్, టోర్నీ నిర్వాహకులు మఠం రాజశేఖర్, వెలుదిండి శివ, బత్తుల యోగేంద్రం తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్, ఎస్‌ఐ రామకృష్ణ

వంతెనలు నిర్మించాలని డిమాండ్

డుంబ్రిగుడ: పోతంగి పంచాయతీ శీలంగొంది రోడ్డు వద్ద చంపపట్టి కాజ్‌వే, పెద్దపాడు గ్రామంలోని చాపరాయి జలపాతం గెడ్డ సమీపంలో వంతెనలు నిర్మించాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బి.పోతురాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో సోమవారం మండల శాఖ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గత 2014లో కురిసిన హుద్‌హుద్ తుపాను కారణంగా చంపపట్టి గడ్డ వద్ద ఉన్న కాజ్‌వే కొట్టుకుపోయిందని అప్పటి నుంచి ఇప్పటివరకు కాజ్‌వే పునర్నిర్మించడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాపరాయి గెడ్డ వద్ద వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు గుర్మిసింగ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వేట కోసం విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

వై.రామవరం: అడవి జంతువుల వేట కోసం కొండలపైన, పొలాల సమీపంలోను, అటవీ ప్రాంతాల్లోనూ విద్యుత్‌తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ బి రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో సోమవారం సాయంత్రం పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అడవి జంతువుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల వల్ల ఎంతోమంది అమాయక గిరిజనులు మృతి చెందారన్నారు. ఇకపై ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే నిందితులు ఎంతటి వారైనా క్షమించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయితో పట్టుబడితే ఎంతటి వారైనా క్షమించేది లేదన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి అక్రమ రవాణాపై సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కోడిపందాలు, పేకాట వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



చవిటిదిబ్బలులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి



సీఐ నరసింహమూర్తి

అడ్డతీగల: దీపావళి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి అని అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతు బాణసంచా నిల్వ చేసే గొడౌన్లు, విక్రయించే దుకాణాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పోలీసు శాఖ సూచించిన నియమ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని వ్యాపారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నివాస గృహాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయవద్దన్నారు. బాణసంచా దుకాణాల మధ్య నిర్దిష్టమైన దూరం పాటించాలన్నారు. విద్యా సంస్థలు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, బక్కెట్లతో ఇసుక వంటి సామగ్రిని దుకాణాల వద్ద ముందస్తు జాగ్రత్త కోసం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.